క్లుప్తంగా

కొనసాగుతున్న ఆధార్ క్యాంప్



ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో నిర్వహిస్తున్న ఆధార్ శిబిరానికి మంగళవారం విశేష స్పందన లభించింది. షెల్టర్‌లోని నిరాశ్రయులతో పాటు పరిసర కాలనీల వారికి కూడా ఆధార్ సేవలు అందించారు. షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఆదర్శనగర్‌లో వృద్ధాశ్రమం నుంచి పలువురును తీసుకొచ్చి ఆధార్ కార్డుల కోసం నమోదు చేయించారు. అదే విధంగా అవసరమైన సవరణలు కూడా చేసుకునేలా వీలు కల్పించారు. ఈ నెల 16 వరకు శిబిరం కొనసాగుతుందని మమత చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ ఎల్లేటి మమత తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



శరవణ్‌నాయుడుకు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

విశాఖ విద్య: జేఈఈ మెయిన్స్‌లో శ్రీచైతన్య ఎన్ఏడీ జోన్ విద్యార్థులు ప్రతిభ చాటారని విద్యా సంస్థల జోన్ ఏజీఎం పి. శ్రీనివాసరావు తెలిపారు. 11 మంది విద్యార్థులు 99 కన్నా ఎక్కువ పర్సంటైల్ సాధించినట్లు వెల్లడించారు. 98 పర్సంటైల్ కన్నా 24 మంది, 95 ఎక్కువ కన్నా 60 మంది సాధించారన్నారు. పి. రుత్విక్ (99.94), పి. కైలాష్ భరత్(99.86),లోకేష్ (99.85), డి. శరవన్ నాయుడు(99.82), డి. రామ్ నీరజ్(99.71), ఎల్. భార్గవ్(99.67),ఎమ్. సుధీర్(99.56),ఎస్. మనోభిరాం(99.52), జి. జశ్వంత్,బాలాజీ కుమార్‌లు(99.42)ఎస్. సత్యసాయి నరసింహపవన్ తే(99.36), డి. రవితేజ (99.13) జాతీయ స్థాయిలో అత్యుత్తమ పర్సంటైల్ సాధించినట్లు తెలిపారు. ఎన్ఏడీ ప్రాంతానికి చెందిన శరవణ్ నాయుడుకు తల్లిదండ్రులు స్వీటు తినిపించి అభినందించారు.

రాంనగర్‌లో లేపాక్షి ఎంపోరియం ప్రారంభం



షోరూంను తిలకిస్తున్న ఏపీహెచ్‌డీసీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

దాబాగార్డెన్స్: రాంనగర్‌లో లేపాక్షి ఎంపోరియం రెండో షోరూం, ఆప్కో మంగళవారం ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ (లేపాక్షి) చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అఖిల భారత వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి కొత్త స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో విశాఖపట్నంలో లేపాక్షి రెండో షోరూం ప్రారంభించామన్నారు. ఎంపోరియం ఏర్పాటుకు కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున కృషి చేశారన్నారు. విశాఖ వాసులు లేపాక్షి ఎంపోరియంలో చేతి వృత్తి కళాకారులు తయారు చేసిన వస్తువులు, చీరలు, వస్త్రాలు కొనుగోలు చేసి, హస్తకళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. త్వరలోనే వైఎస్సార్ జిల్లా గండికోటలో నూతన లేపాక్షి ఎంపోరియం ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. ప్రతీ జిల్లా ప్రధాన కేంద్రంలో వైఎస్సార్ చేతివృత్తుల బజార్ల ఏర్పాటుకు సంబంధించిన ఫైల్ ముఖ్యమంత్రికి పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో లేపాక్షి మేనేజర్ కార్తీక్, ఆప్కో సిబ్బంది పాల్గొన్నారు.

నాడు శిథిలం.. నేడు సుందరం

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం జగన్ అన్ని ప్రాంతాలను ఒకేలా తీర్చిదిద్దుతున్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. ఇందుకు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒకనాడు భయం గొలిపే కంచరపాలెం నేతాజీ వంతెన మార్గాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నారు. బీటీ రోడ్లు, రంగులు, విద్యుత్ స్తంభాలు, పూలకుండీలు ఏర్పాటు చేసి పచ్చదనం పెంపొందించారు. దీంతో ఒకనాడు అధ్వానంగా ఉన్న వంతెన నేడు అందంగా రూపుదిద్దుకోవడం చూసిన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- నేతాజీ వంతెనకు నూతన హంగులు
- బీటీ రోడ్లు, రంగులు, విద్యుత్ స్తంభాలు, పూలకుండీల ఏర్పాటు
- జగనన్న ప్రభుత్వంలోనే సాధ్యమయిందని ప్రజల హర్షం



ప్రమాదభరితంగా విరిగిన ఫుట్‌పాత్ (నాడు)



ఫుట్‌పాత్‌లపై టైల్స్ వేస్తున్న దృశ్యం (నేడు)

కంచరపాలెం: కంచరపాలెం నేతాజీ వంతెన మార్గం సుందరంగా రూపుదిద్దుకోవడంతో పాదచారులు, వాహన చోదకులు సుఖవంతంగా ప్రయాణం చేస్తున్నారు. కంచరపాలెం కూడలి నుంచి జ్ఞానాపురం రైల్వే స్టేషన్ వరకు గల రహదారులకు జీవీఎంసీ నిధులు రూ 1.55 కోట్లు మంజూరు చేసింది. రహదారి వంతెనకు మరమ్మతులు చేపట్టడమే కాకుండా వంతెన మార్గంలో బీటీ రోడ్లు, రంగులు, విద్యుత్ స్తంభాలు, పూల కుండీలు ఏర్పాటు చేయడంతో పరిసరాలు గ్రీనరీగా మారాయి. పాదచారులు నడిచేందుకు ఫుట్‌పాత్‌లపై టైల్స్ ఏర్పాటు చేసి జీబ్రా క్రాసింగ్‌తో తీర్చిదిద్దారు.

వంతెన మరమ్మతులకు ఖర్చు చేసిన నిధులు.. జరిగిన పనుల వివరాలు ఇలా..	
పనులు	నిధులు రూ.
సీసీ రోడ్లు	రూ.11.50 లక్షలు...
బీటీ రోడ్లు	రూ.45.82 లక్షలు..
వంతెన జాయింట్‌కి గ్రౌటింగ్	రూ.12.32 లక్షలు..
ఫుట్‌పాత్‌పై సిమెంట్ పలకలు	రూ.8.21 లక్షలు
ఫుట్‌పాత్‌లకు టైల్స్	రూ.23.45 లక్షలు
విద్యుత్ స్తంభాలు, లైట్లు	రూ.12.67 లక్షలు
ఫుట్‌పాత్‌లకు రంగులు	రూ.18.5 లక్షలు
వంతెన రక్షణ గోడలకు రంగులు	రూ.22.98 లక్షలు

చిమ్మ చీకట్లు తొలగేలా..

గత ప్రభుత్వంలో ఈ వంతెను పట్టించుకునే నాథులు కరవయ్యారు. కంచరపాలెం ప్రధాన కూడలి నుంచి జ్ఞానాపురం రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గాల్లో చిమ్మచీకట్లు కమ్ముకుని ఉండేవి. నేతాజీ వంతెనపై విద్యుత్ స్తంభాలు తుప్పుపట్టి నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు ఫుట్‌పాత్‌లపై పడి పాదచారుల ప్రయాణానికి అడ్డంగా ఉండేవి. సంవత్సరాల పాటు విద్యుత్ లైట్లు వెలగక అటు వాహన చోదకులు ఇటు పాదచారులు ఇబ్బందులు పడేవారు. సాయంత్రం అయ్యేసరికి వంతెన మార్గంలో చీకట్లు కమ్ముకోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు వంతెన మార్గం నిలయంగా మారేది. ఉదయం, సాయంత్రం వేళల్లో మహిళా వాకర్లు ఇబ్బందులు పడేవారు.

ప్రజాప్రతినిధుల కృషితో.

దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె. రాజు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనందకుమార్ వంతెన అభివృద్ధికి నిధులు మంజూరు చేయించారు. జోన్–5 ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో వంతెనపై ఫుట్‌పాత్, సిమెంటు దిమ్మలు ఏర్పాటు చేస్తున్నారు. సిమెంటు పలకలు ఏర్పాటు చేసి టైల్స్ వేశారు. తుప్పుపట్టిన విద్యుత్ స్తంభాలు తొలగించి కొత్తవి వేశారు. వాటికి లైట్లు ఏర్పాటు చేయడంతో వంతెన వెలుగులు విరజిమ్ముతోంది. తాటిచెట్లపాలెం, మర్రిపాలెం నుంచి కంచరపాలెం మీదుగా ఎఫ్‌సీఐ, జ్ఞానాపురం రైల్వేస్టేషన్, కాన్వెంటు కూడలి వైపు ప్రయాణం చేసే ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇది కదా అభివృద్ధి



నేడు: రంగులు-విద్యుత్ స్తంభాలతో సుందరంగా కనిపిస్తున్న నేతాజీ వంతెన

నాడు: నేతాజీ వంతెనపై కమ్ముకున్న చీకట్లు

సమస్యలకు పరిష్కారం చూపారు..



నేను 15 ఏళ్ల నుంచి గొల్లకంచరపాలెంలో నివసిస్తున్నాను. గతంలో వంతెనపై సమస్యలతో వాకింగ్ చేయాలంటేనే భయంగా ఉండేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధితో వంతెనకు మోక్షం లభించింది. వాహన చోదకులు, పాదచారులు సౌకర్యవంతంగా ప్రయాణం చేస్తున్నారు. నాడు జరగని వంతెన అభివృద్ధి నేడు జగనన్న పాలనలో జరగడం ఎంతో ఆనందంగా ఉంది.

–ఎం. రాజ్యం, వాకర్, గొల్ల కంచరపాలెం

అందంగా తీర్చిదిద్దారు..



వంతెన రహదారులు, ఫుట్‌పాత్‌లు, విద్యుత్ దీపాలు, రంగులతో కళకళలాడుతోంది. గతంలో ఈ దారిలో వాహనాలపై వెళ్లాలంటే ఒళ్లు హూనమయ్యేది. రోడ్లకు మరమ్మతులు చేపట్టడంతో వాహన చోదకులు హాయిగా ప్రయాణిస్తున్నారు. గోతులమయంగా ఉండే వంతెన రహదారిపై గత ప్రభుత్వంలో ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఫిర్యాదు చేస్తే ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించారు.

–బి.శ్రీనివాసరావు, రెడ్డికంచరపాలెం,

మరింత సుందరంగా నేతాజీ వంతెన



వంతెనపై నెలకొన్న సమస్యలపై స్పందనలో వినతులు అందాయి. ఇంజినీరింగ్, విద్యుత్ అధికారులు సత్వరం సమస్యలు పరిష్కరించేలా ఆదేశించాం. ప్రజా ప్రతినిధుల కృషితో నిధులు త్వరగా మంజూరై గత ఏడాది అక్టోబర్‌లో యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాం. విద్యుత్ స్తంభాలు, ఫుట్‌పాత్‌లపై సిమెంటు పలకలు వేసే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. వంతెనకు కొత్త హంగులద్ది పనులు పూర్తి చేస్తాం.

– ఆర్‌జీవీ కృష్ణ, జోనల్ కమిషనర్, జోన్–5, జ్ఞానాపురం.

అమ్మకు జేజేలు

- ఘనంగా పైడిమాంబ తీర్థమహోత్సవం
- అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్త జనం

పైడిమాంబ ఆలయానికి భక్తులు పోటెత్తారు. అమ్మా చల్లగ చూడు అంటూ వేడుకున్నారు. పసుపు కుంకుమలు సమర్పించడానికి బారులు తీరారు. చల్లని తల్లిని దర్శించుకుని ఉప్పొంగిపోయారు. పుసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో పైడిమాంబ అమ్మ వారి తీర్థమహోత్సం మంగళవారం అత్యంత వైభవోపేతంగా జరిగింది. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ దేవత ఉత్సవాన్ని తిలకించేందుకు పరిసర కాలనీల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. కోలాటాలు, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా వచ్చి అమ్మ వారికి సారె సమర్పించారు. గర్భగుడిలో అమ్మవారి రూపాన్ని చూసి భక్తులు పులకించారు. పలువురు మహిళా భక్తులు పూనకాలతో ఊగిపోయారు. అమ్మ వారికి పసుపు కుంకుమ,వస్త్రాలు సమర్పించారు.

గణబాబు రాకతో భక్తులకు ఇబ్బందులు

పైడిమాంబ అమ్మవారిని దర్శించుకునేందుకు తరలి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఇదే సమయంలో ఎమ్మెల్యే గణబాబు తన అనుచర వర్గంతో దర్శనానికి వచ్చారు. దేవదాయ శాఖ సిబ్బంది వారిని గర్భగుడిలోకి ప్రత్యేక మార్గం ద్వారా తీసుకెళ్లి గేటు తాళాలు వేయడంతో భక్తుల దర్శనం చాలా సేపు నిలిచిపోయింది. దీనిపై భక్తులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉంటే దేవదాయశాఖ సిబ్బంది మెప్పు కోసం ఇలా వ్యవహరించారని అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై పలువురు భక్తులు దేవదాశాఖ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు.



చల్లగ చూడు తల్లీ..



పైడితలమ్మ దర్శనం కోసం క్యూలో భక్తులు

ఏర్పాట్లు పరిశీలించిన ఏసీపీ రాజీవ్ కుమార్

పైడిమాంబ తీర్థ మహోత్సవానికి వేలాది భక్తులు తరలిరావడంతో గోపాలపట్నం నుంచి ఎన్ఏడీ ఫ్లైఓవర్‌వైపు వచ్చే ఎడమ వైపు దారి ఆలయం ఎదుట పూర్తిగా మూసివేశారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్ కుమార్ అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ట్రాఫిక్ పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న దేవరలు



పూజలు చేస్తున్న భక్తులు



పర్యవేక్షణ చేస్తున్న ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్ కుమార్

22న 'సెయింట్ జోసెఫ్'లో జాతీయ సదస్సు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ షైజీ, నిర్వాహకులు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల బోటనీ విభాగం, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. ఈ మేరకు కళాశాల సెమినార్ హాల్లో మంగళవారం ఆమె బ్రోచర్ ఆవిష్కరించారు. బయొలాజికల్ సైన్సెస్‌లో ఆవిష్కరణలు–అభివృద్ధి సాంకేతికతలు అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఔత్సాహికులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె.మాణిక్యకుమారి కోరారు. కార్యక్రమంలో డాక్టర్ పి.కె. జయలక్ష్మి, డాక్టర్ పద్మసుందరి, సిస్టర్ హేమ, డాక్టర్ నాగరాజు, డాక్టర్ హరిణి, డాక్టర్ వీరబ్రహ్మం, డాక్టర్ మేరీ అనుపమ, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ సుధ తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి సైన్సు ఫెయిర్

విశాఖ విద్య: జిల్లా స్థాయి సైన్సు ఫెయిర్ ఈ నెల 15న నిర్వహించనున్నట్టు జిల్లా సైన్సు అధికారి కె. ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గాజువాక కణితి రోడ్‌లోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వేదికగా నిర్వహిస్తున్న ప్రదర్శనకు జిల్లాలో 65 ప్రాజెక్టులు ఎంపికైనట్టు పేర్కొన్నారు. జిల్లా స్థాయికి ఎంపికైన ప్రాజెక్టులతో విద్యార్థులు, సైన్సు ఉపాధ్యాయులు సకాలంలో హాజరు కావాలని ఆయన సూచించారు. జిల్లా స్థాయిలో ఉత్తమంగా నిలిచిన ఏడు ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో అక్షరాభ్యాసాలు నేడు

దాబాగార్డెన్స్: వసంత పంచమిని పురస్కరించుకుని నగరంలోని కనకమహాలక్ష్మి దేవస్థానంలో చిన్నారులకు బుధవారం అక్షరాభ్యాసాలు చేయించనున్నట్లు ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో పాల్గొనదలిచే చిన్నారుల తల్లిదండ్రులు రూ.200 రుసుం చెల్లించాలని తెలియజేశారు. పూజకు కావల్సిన సామగ్రిని భక్తులే తెచ్చుకోవాలని చెప్పారు. చిన్నారులకు పలక, పెన్ను, పుస్తకాన్ని దేవస్థానమే ఉచితంగా అందజేయనుందని వివరించారు.

సమ్మె విజయవంతం చేయాలని ర్యాలీ



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు, పారిశుధ్య కార్మికులు



బైక్ ర్యాలీలో పాల్గొన్న కార్మిక నాయకులు

మల్కాపురం: ఈ నెల 16వ తేదీన దేశవ్యాప్తంగా జరగనున్న పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకుడు లక్ష్మణమూర్తి పిలుపునిచ్చారు. మల్కాపురం సీఐటీయూ జోన్ ఆధ్వర్యంలో 58,59,60వ వార్డుల పారిశుధ్య కార్మికులతో కలిసి శ్రీహరిపురంలో మంగళవారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న లక్ష్మణమూర్తి మాట్లాడుతూ దేశంలో నేడు ప్రభుత్వ రంగ పరిశ్రమలు మనగడ సాగించ లేకపోతున్నాయన్నారు.అందుకు కారణం కేంద్రంలో బీజేపీ సర్కారు తీరు అని ఆరోపించారు.

పారిశ్రామిక సమ్మెను కార్మికులంతా విజయవంతం చేయాలని ఇండస్ట్రియల్ ఏరియా కార్మిక సంఘాల నాయకులు భోగవల్లి నాగభూషణం,నక్క లక్ష్మణరావుయాదవ్,కాండ్రేగుల సత్యాంజనేయ పిలుపునిచ్చారు. సమ్మె విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం ఐఎన్‌టీయూసీ,టీఎన్‌టీయూసీ,ఏఐటీయూసీ,సీఐటీయూ నాయకులు మల్కాపురం నుంచి హెచ్‌పీసీఎల్ వరకు బైక్ ర్యాలీ చేశారు. కార్మికులంతా 16వ తేదీన చేపట్టబోయే సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వైభవంగా అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడవాహనంపై అధిష్టింపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ చేసి హారతులు అందజేశారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు చక్రవర్తి ఈ సేవ నిర్వహించారు.



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

'ఇన్‌స్పైర్ మనక్'లో 200 ప్రాజెక్టుల ఎంపిక

విశాఖ విద్య: ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక విభాగం మంగళవారం ప్రకటించిన ఫలితాల్లో 200 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఒక్కో విద్యార్థి రూ.10 వేలు ప్రోత్సాహకం అందుకోనున్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను జిల్లాల వారీగా సిద్ధం చేసి, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నగదు ప్రోత్సాహకం అందించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సామాజిక అంశాలే ప్రధానం : మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతీ ఏటా పాఠశాల స్థాయిలో 'ఇన్‌స్పైర్ మనక్' పేరిట విద్యార్థుల్లో సృజనాత్మకతపై పోటీలను నిర్వహిస్తోంది. సామాజిక అంశాలు, సమాజాభివృద్ధికి దోహదపడే వినూత్నమైన ఆలోచనలకు రూపం ఇచ్చేలా ఎలాంటి ప్రాజెక్టులను తయారు చేస్తామనే అంశంపై విద్యార్థులు తమ ఐడియాను నమోదు చేయాల్సి ఉంటుంది. ఇలా ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 2023–24 విద్యా సంవత్సరానికి 2,680 మంది పేర్లు నమోదు చేసుకోగా, ఇందులో 200 మంది ఎంపికయ్యారు. విద్యార్థులు తమకు అందిన రూ.10 వేల నగదు ప్రోత్సాహకాన్ని వినియోగించుకుని, ప్రాజెక్టుకు అవసరమయ్యే సామగ్రిని సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి కె.ప్రసాద్ మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థుల పేర్లతో బ్యాంక్ అకౌంట్ తెరవాలని సూచించారు. దీనిపై ఆయా పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలన్నారు.

ఉరి వేసుకుని యువకుడి మృతి



యండమూరి రాజు(ఫైల్)

గోపాలపట్నం: ఎన్ఏడీ జంక్షన్ దరి గణేష్‌నగర్ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద చెట్టుకు ఉరి వేసుకుని యువకుడు మృతి చెందాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు.. యండమూరి రాజు(21) అక్కిరెడ్డి పాలెం, విమాన్‌నగర్‌కు చెందిన రామలక్ష్మితో ఆర్నెల్ల కిందట ప్రేమ వివాహం చేసుకుని ఎన్ఏడీ సమీపంలోని ప్రియదర్శిని కాలనీలో రెండు నెలలుగా అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. రాజు ఐటీఐ పూర్తి చేసి కొన్నాళ్లు ఓ బిల్డర్ వద్ద సూపర్‌వైజర్‌గా పని చేశాడు. ఆ తర్వాత 104 ఏరియాలో వరుణ్ మోటార్స్‌లో పనికి చేరాడు. కొద్ది రోజులుగా భార్యా భర్తల మధ్య చిన్నపాటి గొడవలు రావడంతో రామలక్ష్మి పుట్టింటికి వెళ్లి పోయింది. దీంతో ఒంటరిగా ఉంటున్నాడు. ఆదివారం కాలనీలో ఉన్న రాజు సోమవారం ఉదయం నుంచి కనిపించక పోవడంతో స్నేహితులు కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికారు. మంగళవారం ఉదయం ఉరి వేసుకుని ఉన్నట్టుగా వాట్సాప్ గ్రూపుల్లో రావడంతో ఎన్ఏడీ జంక్షన్ రైల్వే ట్రాక్ వద్దకు వెళ్లి చూశారు. అక్కడ ఉన్న మృతదేహం రాజుది గుర్తించి ఎయిర్‌పోర్టు పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎయిర్‌పోర్టు సీఐ చక్రధరరావు మృతికి గల కారణాలపై ఆరా తీశారు. మృతునికి తల్లి, తండ్రి, చెల్లి ఉన్నారు. మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ వెంకటరమణ కేసు దర్యాప్తు చేపట్టారు.